రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు 2,919 ఎకరాలు

**భూసేకరణకు రూ.350.84 కోట్ల అంచనా వ్యయం**

**ఆర్థిక అనుమతులు పొందే దిశగా చర్యలు**

**లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులపై ఎమ్మెల్యే శంకర్ సమీక్ష**



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, జూన్ 8, ప్రభాతవార్త :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలో ప్రతిపాదిత కొందుర్గు పరిగి లక్ష్మీదేవిపల్లి (కేపీ లక్ష్మీదేవిపల్లి) రిజర్వాయర్ పనుల పురోగతిపై షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఇంజినీరింగ్ అధికారులు ఈఈ దయానంద్, ఎస్‌ఈ రవికుమార్ పాల్గొని ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, నిర్మాణ పనులు, పరిపాలనా అనుమతుల అంశాలపై చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో భాగంగా ప్రాజెక్టు కింద చేపట్టనున్న ప్యాకేజీ19, 20, 21 పనుల వివరాలను పరిశీలించారు. రిజర్వాయర్ బండ్ నిర్మాణం, పంప్‌హౌస్ ఏర్పాటు, ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వరకు కాలువలు, టన్నెల్ నిర్మాణాల కోసం మొత్తం 2,919 ఎకరాల భూమి అవసరమని అధికారులు వివరించారు. భూసేకరణకు సు మారు రూ.350.84 కోట్ల వ్యయం అంచనా వేయగా, అవసరమైన ప్రతిపాదనలను త్వరిత గతిన పూర్తి చేసి పరిపాలనా, ఆర్థిక అనుమతులు పొందే దిశగా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పరిగి, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి అవసరాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయాభివృద్ధికి, ప్రాంతీయ ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని అధికారులు ఎమ్మెల్యే శంకర్‌తో పేర్కొన్నారు.

**నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు**

ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే షాద్‌నగర్, పరిగి ప్రాంతాల్లో సాగు మరియు తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభి స్తుందని తెలిపారు.

రైతులకు నీటి వనరులు అందుబాటులోకి రావడంతో వ్యవసాయాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

ప్రాజెక్టు పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు

## చికెన్ తీసుకురావటానికి వెళ్లి..

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**ధారూర్, జూన్ 8, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు వాటర్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టి తీవ్రంగా గాయపడిన ఘటన ధారూర్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధారూర్ మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన కార్తీక్ (16) అనే యువకుడిని చికెన్ తీసుకురావాలని అతని తల్లిదండ్రులు ద్విచక్ర వాహనం (ఏ పి 29 డి 9403) ఇచ్చి ధారూర్‌కు పంపించారు. కార్తీక్ ధారూర్ పట్టణంలో చికెన్ తీసుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ధారూర్ ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన డివైడర్‌కు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను కార్తీక్ ప్రయాణిస్తున్న బైక్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్తీక్ తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, వాహనదారులు వెంటనే స్పందించి, తీవ్ర రక్తస్రావమైన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వికారాబాద్‌లోని ఇషా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కార్తీక్ పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు అతనికి అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

## భార్య మరణాన్ని జీర్ణించుకోలేక.. భర్త ఆత్మహత్య

**రంగారెడ్డి అర్బన్, జూన్8, ప్రభాతవార్త :** భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య పాల్పడిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం...శంషాబాద్ మండలంలోని గొల్లపల్లిలో భార్య అనిత మార్చి 2వ తేదిన ఉరిసుకోని ఆత్మహత్య పాల్పడింది. ఈ విషయం కుటుంబ సభ్యుల ద్వారా బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన భర్త శ్రీకాంత్ తెలుసుకున్నాడు. తన సోదరుడు వినోద్‌తో కలిసి జూన్ 3న దుభాయ్ నుండి స్వగ్రామానికి వచ్చాడు. భార్య మృతికి సంబంధించిన దినవారాల కార్యక్రమంలో భాగంగా నిద్ర చేయడానికి ఆదివారం సిద్దులు గుట్టకి వెళ్లి సోమవారం తిరిగి వచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన తర్వాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటానని చెప్పి తన గదిలోకి వెళ్లిన శ్రీకాంత్, అనంతరం ఫోన్ కాల్స్‌కు స్పందించలేదు. దీంతో అతని సోదరుడు గది వద్దకు వెళ్లి పలుమార్లు పిలిచినా స్పందన రాకపోవడంతో తలుపు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా, గదిలోని ఇనుప పైపుకు చీరతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతన్ని కిందికి దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. భార్య మరణాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురై శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు.

## జల్సాల కోసం చోరీలు

**దారితప్పిన ఏసి మెకానిక్‌కు అరదండాలు**

**రూ.26 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం**

**సరూర్‌నగర్, జూన్ 8 ప్రభాతవార్త:** తాళం వేసిన ఇళ్ళను టార్గెట్‌గా చేసుకొని రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడే యువకుడిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్టు చేసి రూ.26 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వైఎస్ఆర్ కడప జిల్లా చాపాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఆకు మల్ల బాబా పీర్ అలియాస్ బాబా (20) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిర్యాల గ్రామం హౌసింగ్ బోర్డు కాలనీలో నివసిస్తూ ఎసి మెకానిక్‌గా పని చేస్తుంటాడు. అయితే జల్సాలు చేయడానికి చోరీలు చేస్తుంటాడు. రాత్రి వేళల్లో నివాస ప్రాంతాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్ళను గుర్తించి విలువైన సొత్తును దొంగిలిస్తుంటాడు. ఈ క్రమంలో పహాడీషరీఫ్ పిఎస్ పరిధిలో నివసించే కొల్హాపూర్ మండలం సున్నపు తాండాకు చెందిన నేనావత్ మల్లిఖార్జున్ ఇంటికి తాళం వేసి ఉండడాన్ని పసి గట్టిన బాబా చోరీకి పాల్పడి 17 తులాల బంగారు ఆభరణాలు, ఒక తులం బిస్కె ట్ బంగారం, 20 తులాల వెండి బిస్కెట్లు, వెండి గొలుసులు అపహరించాడు.




# నడవాలన్నా నరకమే

**రోడ్డు తవ్విండ్రు.. వదిలేసిండ్రు**

**చెన్‌గోముల్ - కంకల్ మధ్యలో నిత్యం అగచాట్లే**

**నిధులిచ్చినా మన్నెగూడ-కడ్మూర్ రోడ్డు నిర్మించటంలేదు**

**పూడూరు మండల వాసుల నిరసన**

2

# ఎల్‌నినో ముప్పుంది

★తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ★ముందుచూపుతో ఉండండి

★రైతులు తక్కువ నీటితో పండే పంటలనే ఎంచుకోవాలి

★నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్ల లైసెన్సులు రద్దు

★బురాన్పూర్ గ్రామ సభలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ హెచ్చరిక

**కొడంగల్, జూన్ 8 ప్రభాతవార్త:** ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున, రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాన్ని అవలంబించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. తక్కువ సాగు నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను మాత్రమే విత్తుకోవాలని ఆయన హితవు పలికారు. వికారాబాద్ మండలం బురాన్పూర్ గ్రామంలో సోమవారం నాడు స్థానిక సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి

ఈ సందర్భంగా సంభందిత శాఖల అధికారులు పంటల మార్పిడి, సరైన మోతాదులో ఎరువుల వినియోగం, రక్షిత మంచి నీటి సరఫరా, వర్షపు నీరు ఒడిసిపట్టడం, భూగర్భ జలాల సంరక్షణ, విరివిగా మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యత, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ మరియు వానాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సభలో కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో జిల్లాకు ఉన్న అరుదైన ఘనతను గుర్తు చేస్తూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల మార్పిడి విధానాన్ని అవలంబించి సాగు రంగంలో ప్రత్యేకతను చాటాలని సూచించారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున, తక్కువ సాగు నీరు అవసరమయ్యే పంటలను విత్తుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం నోటిఫై చేసిన పంట రకాలనే సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులైన రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ ఎంతగానో దోహదపడుతుందని, కాబట్టి ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తినా కూడా పట్టణాలు, నిర్దేశిత గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. అలాగే రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాల పరిశుభ్రత ద్వారా ఈగలు, దోమల వ్యాప్తిని నివారించి వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని సూచించారు.

గ్రామ పంచాయతీలు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేస్తూ... తడి, పొడి, శానిటరీ మరియు ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం గురించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించిన కలెక్టర్, జూన్ 25 నుండి బీఎల్‌ఓలు ఇంటింటికి తిరుగుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తారని, వారికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు.

అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేలా చొరవ చూపాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

# పొగాకు ప్రాణాంతకం

**విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వండి - అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 8, ప్రభాతవార్త :** టొబాకో (పొగాకు) వినియోగం ప్రాణాంతకమైనదని, దీనిపై గ్రామాల ప్రజలకు, స్కూల్స్, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని, దీని వల్ల కలిగే అనారోగ్య సమస్యలను ప్రజలకు వివరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ స్పష్టం చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధ్యక్షతన వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ చంద్రకళ పొగాకు వినియోగానికి అలవాటు పడటానికి గల కారణాలు, పొగాకు వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, జిల్లాలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం కింద చేపడుతున్న చర్యలు, వివిధ శాఖల విధులు, బాధ్యతలు, వారి భాగస్వామ్యం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ టొబాకో ఉపయోగించకుండ చేయటానికి స్కూల్స్, కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, కౌన్సిలింగ్ కూడ నిర్వహించాలని అన్నారు. పోలీస్ శాఖ వారి ద్వారా పాన్‌షాప్స్ బస్‌స్టాప్‌లో నిఘా ఏర్పాటు చేసి రైల్వే స్టేషన్‌లలో ఫైన్ విధించటం లాంటి కార్యక్రమాల ద్వారా పొగాకు తీసుకునే వారి సంఖ్య తగ్గించాలని ఆదేశించారు. అదే విధంగా స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా జూన్ 1నుంచి జూలై 15వరకు సన్నాహక దశ, జూన్ 16నుంచి జూలై 31వరకు అమలు దశగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అంగన్‌వాడి కేంద్రాలు, ఆరోగ్యకేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, ఆసుపత్రుల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన ఆదేశించారు. అదే విధంగా జూన్ 28న నిర్వహించనున్న జాతీయ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం కింద పల్స్‌పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని జూచించారు. జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమం గురించి కూడ వివరించారు. 1నుంచి 19సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికి పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, ప్రైవేట్ విద్యాసంస్థల ద్వారా డీ-వార్మింగ్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగ పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ సాంబశివరావు, డిటిడిఓ పద్మజ, వయోజన విద్య అధికారి వెంకట్‌రెడ్డి, డిడబ్ల్యుఓ జ్యోతి, సిఇఓ కాంతమ్మ, పలువురు వివిధ శాఖల అధికారులు, వైద్య,ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎల్‌ఎన్ బలోపేతానికి ప్రణాళిక ఖరారు

**జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 8, ప్రభాతవార్త:** ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) ఫలితాల మెరుగుదలకు సంబంధించి, 2026-2027 విద్యా సంవత్సరానికి గాను జిల్లా వార్షిక ప్రణాళిక వర్క్‌షాపు నిర్వహించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఓ) రేణుకాదేవి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ వర్క్‌షాపులో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డి. వేణు, జిల్లా రిసోర్సు పర్సన్స్ (డిఆర్పిఎస్), మరియు సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ (సిఎస్‌ఎఫ్) ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్షిక ఎఫ్‌ఎల్‌ఎన్ మూల్యాంకన ఫలితాలు, ఉపాధ్యాయుల అంచనా వివరాలు, మరియు జిల్లాలోని అభ్యాస ధోరణులను సమగ్రంగా సమీక్షించారు. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి సబ్జెక్టుల వారీగా లక్ష్యాలను ఈ సమావేశంలో ఖరారు చేశారు. నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం పలు కీలక అంశాలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. అందులో ముఖ్యంగా.. స్కూల్ రెడ్నెస్ కార్యక్రమం, సబ్జెక్టుల వారీగా రిమిడియేషన్ (లోప నివారణ) వ్యూహాలు. విద్యార్థుల అభ్యాస పురోగతి పర్యవేక్షణ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల బలోపేతం, సహాయక పర్యవేక్షణ వ్యవస్థలు, సమీక్ష విధానాల అమలు, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు, ఉపాధ్యాయులు, మెంటర్ల సామర్థ్యాభివృద్ధి, ప్రోత్సాహక వ్యవస్థలు, జిల్లా స్థాయి ప్రాధాన్యతలు, కాలపట్టికలు, బాధ్యతలు, జవాబుదారితన వ్యవస్థలను ఖరారు చేస్తూ, ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాల సాధనకు సంయుక్త కార్యాచరణ ప్రణాళికను ఆమోదించినట్లు డిఇఓ రేణుకాదేవి తెలిపారు.

# ప్రభుత్వాస్పత్రిలో పాముకాటుకు మందేది?

**ప్రైవేట్ ఆస్పత్రిలో ఒక ఇంజక్షన్‌కు రూ. 8 వేలు**

**మూడు ఇంజక్షన్లు చేయాలన్నారు**

**భరించలేక సర్కారు దవాఖానాకెళితే ఎవరూ పట్టించుకోలేదు**

**ఇంజక్షన్లు అందుబాటులో లేక బిడ్డను కోల్పోయాం**

**9వ తరగతి విద్యార్థి మృతిపై ప్రజావాణిలో ఆగ్రహం**

**నైట్ డ్యూటీ డాక్టర్ కూడా లేరని ధ్వజం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 8, ప్రభాతవార్త :** శామీర్‌పేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో పాముకాటుకు సంబంధించిన ఇంజక్షన్స్ అందుబాటులో లేవని, రాత్రి సమయంలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని అలియాబాద్ గ్రామస్థులు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి అలియాబాద్ గ్రామానికి చెందిన ఒక 9వ తరగతి విద్యార్థి పాము కాటుకు గురయ్యాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో ఒక ఇంజక్షన్‌కు రూ. 8 వేలు అవుతుందని, మొత్తం మూడు ఇంజక్షన్లు ఇవ్వాలని చెప్పడంతో, ఆర్థిక ఇబ్బందుల వల్ల కుటుంబ సభ్యులు అతడిని శామీర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పాముకాటు ఇంజక్షన్ల స్టాక్ లేదని సిబ్బంది సమాధానం ఇచ్చారు. గ్రామస్థులు నిలదీయడంతో కేవలం ఒక ఇంజక్షన్ మాత్రమే వేసి, మిగిలిన వాటి కోసం గాంధీ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. అలాగే ఆ సమయంలో అక్కడ డాక్టర్ కూడా అందుబాటులో లేరని బాధితులు తెలిపారు.

దీనిపై అదనపు కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యపై తగు చర్యలు తీసుకుంటామని, రాత్రి వేళల్లో డాక్టర్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్**

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, డీఆర్డీఓ మాలతిలు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 106 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు, డ్రైనేజీ, తాగునీరు, మరియు ఇళ్ల స్థలాలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఒక వేదిక అని, ఇక్కడ వచ్చే ప్రతి దరఖాస్తుకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన అధికారులను హెచ్చరించారు.

## ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

**జంట హత్య కేసులో నిందితురాలి పట్ల నిర్లక్ష్యంపై ఎస్పీ చర్యలు**

**తాండూరు, జూన్ 8, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు సబ్ డివిజన్ పరిధిలో ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వాహణలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలో సంచలనం సృష్టించిన తాండూరు జంట మహిళల హత్య కేసులో ప్రధాన నిందితురాలుగా ఉన్న కరీమా బేగంను విచారణ నిమిత్తం కరణ్‌కోట్ పోలీస్టేషన్‌కు తరలించారు. విచారణలో ఉండగా కరీమా బేగం బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సమయంలో విధుల్లో ఉన్న బషీరాబాద్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ సునీత, యాలాల పోలీస్టేషన్‌కు చెందిన బస్వరాజు నిర్లక్ష్యం వహించినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు వారిపై జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా సస్పెన్షన్ వేటు వేశారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.



## ప్రభుత్వ భూములపై కన్నేస్తే క్రిమినల్ కేసులు

**దళారులను నమ్మకండి- తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరిక**

**మొయినాబాద్, జూన్ 8, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూములను కబ్జా చేసినా, అక్రమంగా కొనుగోలు-అమ్మకాలు జరిపినా ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రెవెన్యూ శాఖ రాజీ పడే ప్రసక్తే లేదని, భూములను ఆక్రమించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోమవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 176, 177లో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ప్రభుత్వం ఇటీవల సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణం కోసం కేటాయించిందన్నారు. మిగిలిన ప్రభుత్వ భూములను కూడా ప్రజా అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ భూములను కొందరు దళారులు, భూకబ్జాదారులు అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అమాయక ప్రజలను మోసం చేస్తూ కొనుగోళ్లు, అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం అందుతోందని పేర్కొన్నారు. దళారుల మాటలు నమ్మితే తీవ్ర కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల వద్ద రెవెన్యూ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆక్రమించి వేసిన ఫెన్సింగ్‌ను జేసీబీ సహాయంతో తొలగించి భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ భూమి ప్రభుత్వ ఆస్తి అని తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములపై కన్నేస్తే క్రిమినల్ కేసులుంటాయని హెచ్చరించారు.



## చేప ప్రసాదానికి పోటెత్తిన జనం

**ప్రభాతవార్త, అబిడ్స్ ప్రతినిధి:** నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో మృగశిర కార్తెను పురస్కరిం చుకుని బత్తిని సోదరులు ప్రతిసంవత్సరం నిర్వహించే ఆస్తమా రోగులకు అందించే చేప ప్రసాదానికి ప్రభుత్వం తరపున ఏరా ్పట్లు చేయడం మూలంగా జన ం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం తరపున స్వ యంగా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరిలు,వివిధ విభాగాలకు చెందిన అధికారులను అప్రమత్తం చేయడం ద్వారా ప్రజలు ఏర్పాట్లపై సంతప్తిని వ్యక్తం చేశారు. రాత్రి 9గంటలకు చేప ప్రసాదం ప్రారంభం కావడంతో కలెక్టర్ మత్స్యశాఖ, ఆరోగ్య శాఖ, పోలీసు, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి చేప ప్రసాదం పంపిణిని స్వయంగా మైదానంలో కలియ తిరిగి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలతో ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కూడా సంతో షం వ్యక్తంచేశారు. హైదరాబాద్ మహానగరానికి వివిధ రాష్ట్రాలలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. 34 కౌంటర్లను ఏర్పాటు చేసి ఉబ్బసం వ్యాధిగ్రస్థులకు చేప ప్రసాదం ప్రాంతాన్ని పరిశీలించారు. లక్ష50 వేల కొరమెను చేపపిల్లను అందుబాటులో ఉంచినట్లు చె ప్పారు. జిహెచ్ఎంసి, ఆర్‌టిసి ,ఫైర్‌సర్వీస్, వైద్య ఆరోగ్యశాఖ, జలమండలి పోలీసు, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాలశాఖ, ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజల ఆదరణ చూరగొన్నట్లు తెలిపారు.



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**పరిగి జూన్ 8 ప్రభాతవార్త :** రైతులు పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు.. సోమవారం పరిగి మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా తెల్ల జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు మద్దతు ధర అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర, కొనుగోలు సదుపాయాల గురించి వివరించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి , మున్సిపల్ ఛైర్ పర్సన్ రజితవెంకటేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు రామకృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు వెంకట్ రాములు, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు , నాయకులు, రైతులు పాల్గొన్నారు.




గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

## షాద్‌నగర్ గ్రంథాలయానికి పుస్తకాల విరాళం

**షాద్‌నగర్, జూన్ 8, ప్రభాతవార్త :** తమ తల్లిదండ్రులు స్వర్గీయ సయ్యద్ సుల్తాన్ అజీముద్దీన్, అఫ్జల్‌నిసా బేగం జ్ఞాపకార్థం వారి కుమార్తెలు ఫెమినా మహిళా సేవా మండలి అధ్యక్షురాలు ఆలియా సుల్తానా, ఉపాధ్యక్షురాలు సబియా సుల్తానా సోమవారం షాద్‌నగర్ ప్రభుత్వ గ్రేడ్1 గ్రంథాలయానికి విలువైన పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ తల్లిదండ్రులకు విద్య, పుస్తక పఠనంపై ఎంతో అభిమానం ఉండేదని, వారి ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో పఠన సంస్కృతిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పుస్తక పఠనం జ్ఞానాన్ని పెంపొందించి మంచి సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్1 గ్రంథాలయ చైర్మన్ కొప్పుల మదన్ మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి క్యాసెట్ శ్రీనివాస్, ట్రెజరర్ నీళ్ల రవీందర్ గౌడ్, జాయింట్ ట్రెజరర్ కత్తి చంద్రశేఖర్ అప్ప, డైరెక్టర్లు కృష్ణారెడ్డి, శివరాములు యాదవ్, డాక్టర్ వెంకన్న బాబు, గ్రంథాలయ సిబ్బంది, పర్వీన్ బేగం, షబానా బేగం, రూబీనా బేగం, తన్వీర్ బేగం, ఉమేరా, నమీర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో పట్టణాభివృద్ధికి కృషి

### మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

**షాద్‌నగర్, జూన్ 8, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం 9, 18, 21, 26, వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి హాజరై ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ వసంత, 18వ వార్డు కౌన్సిలర్ సంతోషిబాయి చందూలాల్, 26వ వార్డు కౌన్సిలర్ ఎస్పీ శివ, 9వ వార్డు కౌన్సిలర్ అశోక్, 2వ వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్, కోఆప్షన్ సభ్యులు సుజీవన్, సయ్యద్ ఖదీర్, తంగడపల్లి శంకర్, కాలనీవాసులు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు. వార్డు స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఉపసర్పంచ్‌లు

## ఉపసర్పంచుల గౌరవ వేతనాలు పెంచాలి

**షాద్‌నగర్, జూన్ 8, ప్రభాతవార్త :** ఫరూక్‌నగర్ మండల ఉపసర్పంచుల సంఘం నూతన కమిటీ సభ్యులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మండల ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు సమక్షంలో ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి, ఉపసర్పంచుల గౌరవ వేతనాల అంశంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఉపసర్పంచులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా అందరూ ఐకమత్యంగా పనిచేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచుల సంఘం కమిటీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఫరూక్‌నగర్ మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షులు ముక్కు పోగుల ప్రకాష్ గౌడ్, గౌరవ అధ్యక్షులుగా ఎర్రోళ్ల అశోక్, సీనియర్ నేత ఉపసర్పంచ్ మల్కయ్య గారి గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేష్ యాదవ్, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా సయ్యద్ జావేద్, ఉపాధ్యక్షుడిగా శ్యామ్ లాల్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా శివశంకర్, సుమన్ గౌడ్, ప్రచార కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా ఇస్నాత్ గంగాధర్, ప్రధాన సలహాదారుగా నవీన్ రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి, మండల ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## తడి, పొడి చెత్తను వేరుగా అందించాలి

**చేవెళ్ల , జూన్ 8, ప్రభాతవార్త :** తడి, పొడి చెత్తను వేరు చేసి వీధిలోకి వచ్చే గ్రామ పంచాయతీ ఆటోలకు అందించాలని పుల్ మామిడి అశోక్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం నాంచెరి గ్రామంలో సర్పంచ్ పుల్ మామిడి అశోక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్తతో పాటు వివిధ రకాల వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాల్సిన అవసరాన్ని వివరించారు. ఇందుకోసం గ్రీన్ బిన్, బ్లూ బిన్, ఎరుపు బిన్, నలుపు బిన్లలో ఆయా రకాల చెత్తను వేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియలో మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శంకర్ లాల్ ఉప సర్పంచ్ పూర్ణచందర్, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, వీవోఏ, ఏఎన్ఎం, అంగన్ వాడి టీచర్లు, ఆలూరు పీహెచ్ సి వైద్యాధికారి, కారోబార్, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# నడవాలన్నా నరకమే



అర్ధాంతరంగా పనులు ఆపేసిన కంకల్-లాల్‌పహాడ్‌రోడ్డు

**పూడూరు. జూన్ 8, ప్రభాతవార్త :** రోడ్డుతవ్వింద్రు వదిలేసింద్రు. కనీసం పాదచారులు సైతం నడవలేని స్థితిలో పల్లేరుకాయ ముళ్లవలె ఉన్న కంకరను పక్కకు తీయకుండా రోడ్డుపైనే చాపవలె పరిచి ఉంచింద్రు. దీంతో పలు వాహనాలు పంక్చరై కిందపడిన సందర్భాలు కోకొల్లలు. అయినా అధికార యంత్రాంగంలో చలనంలేదన్న విమర్శలు ఈప్రాంత ప్రజలనుండి వినిపిస్తున్నాయి. ఇది ఎక్కడోకాదు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల దుస్థితి. మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లి-లాల్‌పహాడ్ ఆర్అండ్‌బి బిటిరోడ్డును కంకల్‌నుండి అంగడి చిట్టంపల్లి గేట్ వరకు సుమారు ఆరున్నర కిలోమీటర్ల మరమ్మతులు చేపట్టేందుకు డిఎంఎఫ్‌టి కింద సుమారు రూ.1.50కోట్ల నిధులు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మంజూరయ్యాయి. దీంతోపాటు మన్నేగూడనుండి కద్మూరు వరకు పంచాయతీరాజ్ క్రింద బిటిరోడ్డును పునర్నిర్మాణానికి నిధులను మంజూరు చేసి పనుల నిర్వహణ నిమిత్తం కాంట్రాక్టర్‌కు కూడా అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ రోడ్డు చెన్‌గోముల్ నుండి కంకల్ వరకు జెసిబిలతో గుంతల మయంగా ఉన్న రోడ్డును తవ్వితే తేలిన కంకరను లేవలింగ్‌కోసం రోడ్డుపైనే పరిచారు. పనులు కొనసాగుతున్న సమయంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో అర్ధాంతరంగా మరమతు పనులు ఆగిపోయాయి. ఆ తరువాత చేపట్టాల్సిన పనులు ఏకారణం చేతనోగాని రెండున్నర ఏళ్ల గడుస్తున్నా పునఃప్రారంభించలేదు.

మన్నెగూడ-కద్మూరు రోడ్డు పరిస్థితి కూడా అంతే. అదే విధంగా కంకల్ నుండి లాల్‌పహాడ్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరయ్యాయి. అయితే లాల్‌పహాడ్‌నుండి తుర్క ఎన్కెపల్లి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం పూర్తికాగా, తుర్కఎన్కెపల్లి నుండి కంకల్‌వరకు చేపట్టిన పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. రోడ్డుపై కంకర విరజల్లిన విధంగా ఉంది. ఈ మార్గంలో వెళ్లే వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకీ గురవుతున్నాయి. రోడ్డుపై ఉన్న దుమ్ము, ధూళితో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఒకదానికొకటి ఢీకొట్టిన సందర్భాలూ ఉన్నాయి. కనీసం నడిచి కూడా వెళ్లలేని దుస్థితి ఉంది. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డు నిర్మాణపు పనులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల వాహనదారులు ప్రభుత్వ యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

**రోడ్డును వెంటనే నిర్మించాలి**

**బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు రయీస్ అహ్మద్‌ఖాన్**

కంకరరోడ్డుతో ప్రయాణికులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి

**ఎమ్మెల్యే దృష్టికి తెచ్చినా పట్టించుకోవడంలేదు**

**రవీందర్, జిల్లా బిజెపి అధికార ప్రతినిధి**

అంగడి చిట్టంపల్లి -లాల్‌పహాడ్ రోడ్డుతోపాటు మండలంలోని మన్నెగూడ నుండి కద్మూరు, వివిధ గ్రామాల రోడ్లు పాడై వాహనదారులకు ప్రాణాంతకంగా మారాయి. ఈ విషయం పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చినా పట్టించుకోవడంలేదు. త్వరలో అఖిలపక్ష సభ్యులతో కార్యాచరణను రూపొందించి ఎమ్మెల్యేను కలుస్తాం. పట్టించుకోకుంటే ఉద్యమిస్తాం.

**డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపాం**

**ఆర్అండ్‌బి ఎఇ ఆంజనేయులు**

లాల్‌పహాడ్ నుండి కంకల్‌వరకు నిర్మిస్తున్న రోడ్డు కాంట్రాక్టర్‌కు బిల్లులు రానందున తుర్కఎన్కెపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మించి అర్ధాంతరంగా ఆపాడు.

అంగడి చిట్టంపల్లిగేట్ నుండి కంకల్ వరకు కొంతమేర పనులు చేసింది వాస్తవమే. మిగతా రోడ్డు అసంపూర్తిగా ఉంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుండి డబుల్‌రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

# రావల్‌కోల్‌లో వార్డు సభ రసాభాస

### ప్రజా సమస్యలపై అధికారులకు చిత్తశుద్ధిలేదని స్థానికుల ధ్వజం

**మేడ్చల్, జూన్ 8, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావల్‌కోల్, రాజబొల్లారం గ్రామాల్లో సోమవారం అధికారులు వార్డు సభలను నిర్వహించారు. సభలను మొక్కుబడిగా నిర్వహించడం తప్ప ప్రజా సమస్యలను తెలుసుకోవడంలో అధికారులకు ఎలాంటి చిత్తశుద్ధీ లేదని ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు తీవ్ర దుస్థితిలో ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారని నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఉన్నప్పుడు సమస్య వెంటనే పరిష్కరించేవారని, నేడు కనీసం ఒక వీధి లైటు కూడ వేయలేకపోతున్నారని ఆరోపించారు. సమావేశాలతో సరిపెట్టకుండా ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, వార్డు కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.




వార్డు సభలో మాట్లాడుతున్న స్థానికులు

# దారిమళ్లిన సబ్సిడీ విత్తనాలపై విచారణ జరపాలి

**పరిగి జూన్ 8 ప్రభాతవార్త:** రైతులకు అందించే సబ్సిడి విత్తనాల దారి మళ్లింపు, దుర్వినియోగంపై విచారణ చేపట్టి వివరణ ఇవ్వాలని పరిగి పట్టణ బిఆర్ఎస్ నాయకులు కలిసి సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్‌కు వినతి పత్రం అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఇచ్చే సబ్సిడీ పల్లి విత్తనాలు పరిగి నియోజకవర్గంలోని దోమ, కులకచ్చర్ల మండలాల్లో రైతులకు సబ్సిడి విత్తనాలు అందించకుండా, అక్రమంగా దారి మళ్ళించడంపై వ్యవసాయ శాఖ అధికారులు వివరణ ఇవ్వాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు వెంటనే సబ్సిడీ విత్తనాలను అందజేసి, ఎరువులు, పురుగుల మందులను సకాలంలో అందజేయాలని కోరారు. అక్రమంగా దారి మళ్లించిన పల్లీ విత్తనాలను వెంటనే రైతులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు వివతి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ కరణం అరవింద్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, కౌన్సిలర్లు చంద్రకళ, జాక్ రవికుమార్, మీది గడ్డ శ్రీనివాస్, వార్ల రవి, తాహెర్ అలీ, శశాంక్ రెడ్డి, నరేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ కృష్ణ, సేవియా నాయక్, మంగు సంతోష్, పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఎడికి వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నేతలు

# సమస్యల పరిష్కారానికి బాధ్యతగా వ్యవహరించాలి

**చేవెళ్ల, జూన్ 8, ప్రభాతవార్త :** చేవెళ్ల మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ ఛైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి హాజరయ్యారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపల్లి 11వ వార్డు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం సందర్భంగా వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ దేవర సమత వెంకట్రెడ్డి హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ మన సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా వన మహోత్సవం విజయవంతం చేయడం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), వరదల నిర్వహణ మరియు ప్రజల భద్రత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.

ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ యాదగిరి, స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, 11వ వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచులు జంగారెడ్డి, మల్లేష్, వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**కొడంగల్, జూన్ 8 ప్రభాతవార్త:** మహిలు ఆర్థికంగా ఎదుగేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో టీజీఐఎల్‌పి ఐలెట్ ప్రోగ్రాంలో భాగంగా అత్యంత నిరుపేదలైన వారికి వివిధ జోవనోపాదుల కార్యక్రమాల పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల యూనిట్స్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తు వారి జీవనోపాదుల మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు.

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్, గ్రామ సర్పంచ్ ఎల్లపనఊప, డీఆర్‌డీఏ డీపీఎం శేఖర్, మండల మహిళ సామాఖ్య అద్యక్ష, కార్యదర్శులు అంజమ్మ, మాసనమ్మ, కోశాధికారి సత్యమ్మచ, ఏపీఎం పి.గోపాల్, టీజీఐఎల్‌పీ జిల్లా కోఆర్డీనేటర్ రవికుమార్, సిసిలు బసంత్‌కుమార్, ఆర్.రాములు, భూపతి, ఎంసీ, కోచ్‌లు, వీఓఏలు గౌరమ్మ, నజీర్‌లతో పాటు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

## నాయకుడు తోటమాలిలా ఉండాలి

**షాద్‌నగర్, జూన్ 8, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ ఎంసీ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభకు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేదికపైకి ఆహ్వానించినప్పటికీ ఆయన ప్రజల మధ్యనే కూర్చొని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను శ్రద్ధగా విన్నారు.

గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, బస్‌స్టాప్ వద్ద ప్రమాద నివారణ చర్యలు వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్రజల విజ్ఞప్తిపై స్పందించిన ట్రాఫిక్ సీఐ శంకరయ్య అక్కడ బ్యారికేడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ నాయకుడు తోటమాలిలా ఉండి ప్రజలను కాపాడాలని, రాజకీయాలకు అతీతంగా గ్రామ సమస్యలను అందరూ కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గ్రామసభకు హాజరై ప్రజల మధ్య కూర్చొని సూచనలు ఇవ్వడం సంతోషకరమని సర్పంచ్ ఎంసీ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఆయన రాక కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చిందని ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్థులు, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## ఆర్మీకి ఎంపికైన యువకులకు సన్మానం

**చౌడపూర్, జూన్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని లింగన్నపల్లి గ్రామానికి చెందిన వల్లెపు సంజీవ, వడ్డె శ్రీకాంత్ భారతదేశ అత్యున్నత సేవా సంస్థ అయిన భారత సైన్యానికి ఎంపికైనందున తెలంగాణ ఉద్యమ కారుడు కొడగంటి వెంకటేష్ ఆధ్వర్యంలో యువకులను ఘనంగా సన్మానించారు. దేశ రక్షణ కోసం సైన్యానికి గ్రామ యువకులు ఎంపిక కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ దేశం కోసం జీవించడం గొప్ప గౌరవమని, దేశ రక్షణ కోసం సేవ చేయడం అత్యున్నత త్యాగమని, దేశభక్తితో దేశ ప్రజల రక్షణకు యువకులు సేవలనందించాలని ఆయన అన్నారు.




మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్ పర్సన్ రజిత వెంకటేష్

## పరిగి పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

**పరిగి, జూన్ 8 ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా, పరిగి పురపాలక అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో వేగంగా అభివృద్ధి చేస్తామని పరిగి మున్సిపల్ ఛైర్ పర్సన్ రజితవెంకటేష్ తెలిపారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పరిగి పట్టణంలోని 16వవార్డులో నిర్వహించారు. పట్టణ ప్రగతి ప్రణాళికలో భాగంగా తాను స్వయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న 16వ వార్డు అభివృద్ధితో పాటు పట్టణంలోని అన్ని వార్డులలో అభివృద్ధిని మెరుగుపరుస్తామని ఛైర్ పర్సన్ రజితవెంకటేష్ తెలిపారు. సమావేశంలో భాగంగా పట్టణ అభివృద్ధికి చేపట్టిన పనులు, చేయాల్సిన పనుల గురించి వివరిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లేష్, ఎస్ఐ మోహన కృష్ణ, ఎంఈఓ అంజయ్య పాల్గొన్నారు.

## త్వరలోనే విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

**చేవెళ్ల, జూన్ 8, ప్రభాతవార్త :** చేవెళ్ల పట్టణ కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ చేవెళ్ల మున్సిపల్‌అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. సోమవారం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. చేవెళ్ల ఏడీఈ సాయినాథ్ను కలిసి పట్టణ, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ అంతరాయాలు, తక్కువ వోల్టేజ్ సమస్యలు తదితర అంశాలను వివరించారు. అనంతరం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాలను స్వీకరించిన అధికారులు సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు అనంతరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వైభవ్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబెర్ దేవుని శర్వలింగం, పత్తి సత్యనారాయణ, పీసరి శ్రీకాంత్ రెడ్డి, అల్లాడ అభి షేకర్ రెడ్డి, తెలుగు శ్రీనివాస్, బాల్ రెడ్డి, మధుకర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి. జయసింహ రెడ్డి, పాగా వెంకటేష్, శివ కుమార్, అడ్వకేట్ శ్రీనివాస్, గాజులగూడెం శ్రీనివాస్ రెడ్డి, మహిపాల్ రెడ్డి శివకుమార్ గౌడ్ జగదీశ్వర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రాజు, రమేష్, జై సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవ సమాజం అధ్యక్షుడిగా బొబ్బిలి ప్రవీణ్ ఎన్నిక

**షాద్‌నగర్, జూన్ 8, ప్రభాతవార్త :** షాద్‌నగర్ వీరశైవ సమాజం అధ్యక్షు డిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన బొబ్బిలి ప్రవీణ్‌ను పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు, హోప్ ఫౌండేషన్ అధినేత కొండ విజయ కుమార్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. బొబ్బిలి ప్రవీణ్ నాయకత్వంలో వీరశైవ సమాజం మరింత అభివృద్ధి చెందాలని, సమాజ సంక్షేమం కోసం ఆయన చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షి ంచారు. సమాజ సభ్యుల విశ్వాసాన్ని చూరగొని వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఆయన సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో షాబాద్ వీరశైవ సమాజం నాయకుడు మల్లికార్జున్, షాబాద్‌కు చెందిన దండు మదన్ తదితరులు పాల్గొని బొబ్బిలి ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రవీణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## నాణ్యతలేని పరికరాల వల్లే అగ్నిప్రమాదాలు

**హైదరాబాద్,జూన్ 8,ప్రభాతవార్త:** వరుస తనిఖీలతో పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, బహుళ అంతస్తుల భవనాల్లో విద్యుత్ ప్రమాదాలు తగ్గాయి. అధికారుల నిశిత పరిశీ లన వల్ల కొత్తగా ఏర్పాటు చేసే సంస్థల్లో విద్యుత్ లైన్లు, సరఫరా వ్యవస్థ, భద్రతా ప్రమాణాలు మెరుగుపడ్డాయి అని చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్‌స్పెక్టరేట్ ఆఫ్ తెలంగాణ కె.నందకుమార్ స్పష్టం చేశారు. ఆ సీఈఐజీగా బాధ్యతలు స్వీకరించి, ఆగస్టుతో ఏడాది కాలం పూర్తి కాబోతోంది. ఆయన పనితీరు కు గుర్తింపుగా ప్రభుత్వం ఆయన పదవికాలన్నీ మరో ఏడాది పాటు పొడగించింది. ఈ సందర్భం గా పలు అంశా లను ఆయన మీడియాకు వెల్లడిం చారు. ఖర్చుతో పోలిస్తే..ఆదాయమే అధికమని గతంలో ఎన్నడూ లేని విధంగా తనిఖీలు, కొత్త కనెక్షన్లకు అనుమత ల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. కేవలం ఒక్క హెచ్‌టి కనెక్షన్ల ద్వారానే రూ.16 కోట్లు, సినిమా హాల్స్ ద్వారా రూ.7 కోట్ల ఆదాయం సమకూరిం ది. ఇక పీరియాడికల్ ఇన్సుపెక్షన్ల ద్వారా మరో రూ.3 కోట్ల ఆదాయం వచ్చింది. సీఈఐజీ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగుల వేతనాలు నిర్వహణ ఖర్చులకు ఏటా రూ.తొమ్మిది కోట్లు ఖర్చు అవుతుంది. ఈ విభాగానికి చేస్తున్న ఖర్చు తో పోలిస్తే..ప్రభుత్వానికి లభిస్తున్న ఆదాయమే అధికం. ముఖ్యంగా సీఈఐజీ విభాగంలో పారదర్శకతకు పెద్దపీఠ వేశాం. 89 మంది ఉద్యో గులతో ఒక వాట్సాప్ గ్రూఫ్ క్రియేట్ చేశాం. ప్రతి రోజూ ఉదయం 8 గంట లకు అంతా కలిసి రోజూవారీ యాక్షన్ ప్లాన్ రూపొందించుకుంటు న్నాం. ఎవరు? ఏ కంపెనీలో తనిఖీలకు వెళ్లారు? గుర్తించిన లోపాలు? వంటి అంశాలను రిజిస్టర్ లో రికార్డు చేయిస్తున్నాం. వారంలో నాలుగు రోజుల్లో జిల్లాల్లో పర్యటించి, ఆయా ప్రాంతా ల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో తనిఖీలు నిర్వ హిస్తున్నాం. తోటి ఉద్యోగుల పనితీరులోనూ మా ర్పు తీసుకొచ్చాం. అవినీతి, అక్రమాలకు ఆస్కా రం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్దేశిత గడువులోగా ఫైళ్లు క్లియర్ చేయిసున్నాం. దరఖాస్తు సహా విద్యుత్ లైన్లలో ఏదైనా షార్ట్‌పాల్ ఉంటే.. ముందే గమనించి, వాటిని సరి చేయిస్తున్నాం. వినియోగదారుల కోసం ఫోన్ నంబర్ః 040-23450367ను పునరుద్ధరించాం.

**ప్రమాణాలు పెంచి..ప్రమాదాలు నివారణ..**

హెచ్‌టీ కనెక్షన్ల కోసం అనుమతులు కోరుతూ ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను నిషితంగా పరిశీలిస్తున్నాం. వినియోగదారుడు ఎంపిక చేసు కున్న లోడుకు తగ్గ ప్రమాణాల మేరకు లైన్లు, కేబుళ్లు, ఏబీ స్విచ్ బోర్డులు, ఎర్తింగ్ సిష్టం, ప్యానల్ బోర్డులు, ఫ్యూజ్ బాక్సులు, డీటీ ఆర్, బ్రేకర్, కండక్టర్ ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే అనుమతులు జారీ చేస్తున్నాం. క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన లోపాలను సరి చేసు కోవాల్సిందిగా సూచిస్తున్నాం. ఆ మేరకు మార్పులు, చేర్పులు చేసిన తర్వాతే..అను మతులు జారీ చేస్తున్నాం. తద్వారా ఆయా పారిశ్రామిక, వ్యాపా ర, వాణిజ్య సంస్థల్లో విద్యుత్ ప్రమాణాలను పెంచి, ప్రమాదాలను నియంత్రించేందుకు కృషి చేస్తున్నాం.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**కడ్తాల్, జూన్ 8, ప్రభత :** కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం న్యామతాపూర్ గ్రామ శివారులో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. .న్యామతపూర్ గ్రామానికి చెందిన మార్చ జంగయ్య (58) కుటుంబ కలహాలతో ఉదయం 10గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. గ్రామ శివారులో ఉన్న మర్రి చెట్టుకు ఉరివేసుకొని హత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్థులు స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానికుల సహాయంతో కిందకు దింపారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతుని అల్లుడు వెంకటేష్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ప్రజా పాలనతో గ్రామాభివృద్ధికి బాటలు

**మల్లారెడ్డిగూడలో ప్రత్యేక గ్రామసభ**

**షాబాద్, జూన్ 8, ప్రభాతవార్త :** ప్రజా పాలన ద్వారా గ్రామాభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని మల్లారెడ్డిగూడ గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీరాజ్ ఏఈ ఆశా జ్యోతి అన్నారు. సోమవారం మల్లారెడ్డిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ..గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజలసహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామ సమస్యలను గ్రామ సభల ద్వారానే పరిష్కరించుకోవచ్చని అన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బలవం త్రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

**బాధ్యతలు స్వీకరించిన నూతన పంచాయత్ కార్యదర్శి రాజు**



బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డిని సన్మానించిన సర్పంచ్

**నందిగామ, జూన్ 8, ప్రభాతవార్త:** నందిగామ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై వెళ్లిన మల్లికార్జున్ రెడ్డి గారికి సర్పంచ్ కొమ్ము కృష్ణ ఆధ్వర్యంలో పూలమాల శాలువ వేసి సన్మానించి వీడుకోలు పలికారు. అలాగే నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి రాజును సన్మానించి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము కృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ విద్య రీత్యా బదిలీలు సహజమని. అన్నారు. నిన్నటి వరకు నందిగామ పురోగతికి అందించిన సేవలను కొనియాడారు. ఎక్కడికి వెళ్లినా భగవంతుడు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు , ఆశీస్సులు అందజేయాలని భగవంతుని కోరుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి మమత సూరి , శివగళ్ల సురేష్, బొమ్మగల నర్సింలు, టైలర్ కృష్ణ, కిట్టు, నాయకులు డైరెక్టర్ కుందారం వెంకట్ రెడ్డి, చించేటి కృష్ణ గౌడ్, బి జంగయ్య గౌడ్, బోర్ర ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎర్రగారి రమేష్, కారోబార్ శ్రీను పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేయరాదు పరిశుభ్రత పాటించండి

**తలకొండపల్లి జూన్ 8 ,ప్రభాతవార్త:** గ్రామంలో పరిశుభ్రత పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని రోడ్లపై విచ్చలవిడిగా చెత్తను రోడ్లపై విచ్చలవిడిగా చెత్తను పారబోయ రాదని లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గ్రామ కాసు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గ్రామ సమావేశం నిర్వహించారు స ఈ సమావేశానికి గ్రామ ప్రత్యేకాధికారి తాసిల్దార్ రమేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రం కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని తడి పొడి చెత్తను గ్రామపంచాయతీ సిబ్బంది తీసుకెళ్లే ట్రాక్టర్లో వేయాలని రోడ్లపై విచ్చలవిడిగా వేయడం వల్ల దోమలు ఈగలతో రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు అర్హులైన వారందరూ సద్వినియోగ పరచుకోవాలన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రత్యేక సంక్షిసవరణ కార్యక్ర మానికి అర్హులైన గ్రామస్తులందరూ ఓటర్ సవరణకు సహకరించి సవరణ చేయించు కోవాలన్నారు. తలకొండపల్లి సిఐ జానకిరామ్ రెడ్డి మాట్లాడుతూ యువకులు దూరాల వాట్లుకు లోను కాకుండా మద్యం మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎవరు నేరాలపై అప్ర మత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అనుమానాస్పద కాలు లింకులు ఓపెన్ చేసి చిక్కుల్లో పడకూడదని యువ కులకు గ్రామ ప్రజలకు ఆదర్శంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాశీ శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక అధికారి తాసిల్దార్ రమేష్ కుమార్, సీఐ జానకిరామ్ రెడ్డి ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, యుపిఎస్ హెచ్ఎం కృష్ణారెడ్డి వార్డు సభ్యులు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# లాల్‌గడిమలక్‌పేట్‌లో బీరప్పస్వామి కల్యాణోత్సవం

**..పాల్గొన్న మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి**

**శామీర్‌పేట, జూన్ 8, ప్రభాతవార్త:** లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలోని బీరప్ప ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో బీరప్ప ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. బీరప్ప కల్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి విచ్చేసి బీరప్ప స్వామి వారిని దర్శించుకున్నారు. సాంప్రదాయ బద్ధంగా బీరప్ప ఆలయంలో కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బీరప్ప స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. బీరప్ప ఆలయంకు విచ్చేసిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని ఆలయ కమిటీ వారు మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల మాజీ జడ్పీటిసి సభ్యురాలు ఎం.అనితలాలయ్య, లాల్‌గడిమలక్‌పేట్ మాజీ సర్పంచులు సి.శ్రీనివాస్‌రెడ్డి, బీర్కూరి వెంకటేశ, కౌన్సిలర్ గుర్క కుమార్‌యాదవ్, మండల బిఆర్ఎస్ నాయకులు ఎస్.మోహన్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పలువురు నాయకులు, భక్తులు, ఆలయ కమిటీ వారు, తదితరులు పాల్గొన్నారు.



,లాల్‌గడిమలక్‌పేట్‌లోని శ్రీ బీరప్ప ఆలయంలో జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,పాల్గొన్న నాయకులు,భక్తుల దృశ్యం

# రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభం

**కీసర, జూన్ 8, ప్రభాతవార్త:** ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కాంగ్రెస్‌పార్టీ నాయకులు కౌకుంట్ల జీవన్‌రెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని మధురానగర్‌లో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను సోమవారం నాయకులు ప్రారం భించారు. జీవన్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి పనులను మొదలుపెటట్టారు. ప్రజలకు మెరుగైన రోడ్డు సౌలభ్యం అందించాలనే లక్ష్యంతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. నాయకులు మల్లారెడ్డి, బద్దం మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**..సుచిత్రకాలనీలో డ్రైనేజీ పనులు..**

నాగారం డివిజన్ సుచిత్రకాలనీలో భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులను నాయకులు ప్రారంభించారు. కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చేపట్టిన ఈపనులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు కౌకుంట్ల జీవన్‌రెడ్డి, పంబాల రమేశ్, భూమయ్య, పొట్ట శ్రీశైలం, బాలుయాదవ్, సోమిరెడ్డి, కాలనీ అధ్యక్షులు



రోడ్లపై చెట్లను తొలగిస్తున్న నాయకులు

## వర్షంతో కూలిన చెట్లు

**...క్లియర్ చేసిన ప్రజాప్రతినిధులు**

**తలకొండపల్లి, జూన్ 8 ,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని తలకొండపల్లి నుంచి పడకల్ వెళ్లే రోడ్డులో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై చెట్లు విరిగిపడి రాకపోకలు బంద్ అయ్యాయి. గాలి వానతో రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగిపడి రోడ్డుపై పడడంతో ప్రయాణికులకు రాకపోగాలకు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. దీంతో తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్డుపై విరిగిపడిన చెట్లను తీసివేయించారు. జెసిబి సహాయంతో చెట్లను తీసివేసి ప్రయాణికులకు సౌకర్యం కల్పించడం పట్ల గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. అనంతరం మృగశిల కార్తిని పురస్కరించుకొని ముదిరాజులు నిర్వహిస్తున్న ఎర్రగుంట చెరువు వద్ద చేపలు పట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ ఉప సర్పంచ్ కోటీశ్వర్ , వార్డు సభ్యులు పెరుమళ్ళ అంజయ్య మాజీ ఉపసర్పంచ్ పద్మా అనిల్ వల్ల బాలయ్య రొయ్యల యాదయ్య ఈశ్వర్ బాలకృష్ణ న్యాకం శివ భాష మన శ్రీరాములు గోపాల్ శంకరయ్య కటిక మల్లేష్ పుట్ట శివ తదితరులున్నారు.

## మైనారిటీల హక్కులు పరిరక్షించాలి

**ఘట్‌కేసర్, జూన్ 8, ప్రభాతవార్త:** రాజ్యాంగం ప్రకారం మైనారిటీల హక్కులను పరిరక్షించి అందరికీ సమాన అవకాశాలు, మతస్వేచ్చను అందించేందుకు హక్కులు కల్పించారని యువ నాయకుడు షేక్ సలీమ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 269వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. సలీమ్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ 60 దేశాల రాజ్యాంగాలను చదివి భారతదేశ వర్ణ వ్యవస్థని, కులవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని దేశ స్థితిగతుల కారణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సలీమ్ అంబేద్కర్ అందించిన సేవలను, పోరాటాలను తెలియజేస్తూ ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం భారతీయ గిరిజన స్వాతంత్ర సమరయోధుడు భిర్సా ముండా (15 నవంబర్ 1875-9 జూన్ 1900) 126వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. అరుణ్‌కుమార్ ఈసందర్భంగా బిర్సా ముండా జీవితచరిత్రను వివరించారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, నాయకులు అజ్జూ, ఫయాజ్, ఫర్హా న్, బండారు రాందాస్, కె.నర్సింగ్‌రావు, రాజేశకుమార్, కడప రవీందర్, తోట శ్రీనివాస్, బాలనగరం గణేశ్‌గౌడ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి బలోపేతానికి సమిష్టిగా కృషిచేయాలి

**ఘట్‌కేసర్, జూన్ 8, ప్రభాతవార్త:** బూత్‌స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా కార్యదర్శి విప్పర్ల హనుమాన్ అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ చందుపట్లగూడలో సంస్థాగత అంశాలపై డివిజన్ ఆఫీస్ బేరర్లు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఘట్‌కేసర్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి వి.హనుమాన్ పాల్గొని మాట్లాడుతూ బూత్‌లనఉ మరింత పటిష్టం చేసి బిజెపిని సంస్థాగతంగా బలోపేతం చేయాలని సూచించారు. బూత్ అధ్యక్షులు, బూత్‌స్థాయి కార్యకర్తలు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రతి బూత్‌లో బిజెపి జెండా రెపరెపలాడేలా కృషి చేసి పార్టీ విజయానికి అందరూ సమిష్టిగా పనిచేయాలని హనుమాన్ తెలియజేశారు.

## తెలుగు రాష్ట్రాలు దేశంలోనే నెంబరు వన్‌స్థాయికి ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌చౌదరియాదవ్

**సైఫాబాద్, జూన్ 8 ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉభయ తెలుగు రాష్ట్రాలు ఐక్యం వర్థిల్లాలని పరిశ్రమలు, పాడి పంటలతో అభివృద్ధి చెంది దేశంలోనే నెంబరు-వన్ స్థాయికి ఎదగాలని సమైక్యాంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటి కుమార్ చౌదరియాదవ్ అకాంక్షించారు. చిన్న, చిన్న సమస్యలతో గోడవులు పడి అశాంతికి తావు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశా రు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రవారు, మర్వాడి గోబ్యాక్ నినాదాలకు స్వస్తి పలకా లని, అభివృద్ధిపైన దృష్టిని కేంద్రీకరించి కొత్త, కొత్త పరిశ్ర మలు రావడానికి కృషి చేసి, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉభయ రాష్ట్రాల ప్రజల కు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. నినాదాలు చేసి మళ్ళీ బంచన్ దొర కాళ్ల మొక్కతా అనే నిజాం నిరంకుశ సంస్కృతికి అవకాశం కల్పించరాదన్నారు. సర్ధార్ వల్లభా యి పటేల్ హైదరాబాద్ స్టేట్ ముగింపుకు, భారతదేశం లో విలీనంకు సర్ధార్ వల్లభాయి పటేల్ ఎంతో కృషి చేశారని, ఇందుకోసం ఎంతో కష్టపడ్డారని ఆయన గుర్తు చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన పుచ్చపల్లి సుందరయ్య నైజాం నిరంకుశ పాలనుకు వ్యతిరేకరంగా ఉద్యమించారని, ఎన్టీఆర్ సిఎంగా ఉన్నప్పుడు ఉభయ ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రంలో కర్ఫ్యూలు పెట్టలేదని, పేద, మధ్య తరగతి ప్రజలతోపాటు అందరూ సుఖ సంతోషాలతో జీవించారని ఆయన గుర్తు చేశారు. క్రాంతిదళ్ పార్టీ నాయకుడు ప్రృద్వీరాజ్ తెలంగాణలో లేని పోని మాటల తో ప్రజలను రెచ్చగోడుతున్నారని, ఆంధ్రవారికి కాంట్రా క్ట్‌లు ఇవ్వరాదు, భూములు విక్రయించరాదని వ్యాఖ్యలు చేస్తున్నారని, అలాంటప్పుడు కాశ్మీర్‌లో వలే ఆర్టికల్ 370 తీసుకురావాలని సవాల్ విసిరారు. అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలలో ఏలాంటి గోడవలు లేవని, ప్రశాంతంగా ఉన్నాయని, బిహార్, ఒరి స్సా రాష్ట్రాల నుంచి ప్రజలు ఇక్కడ వరి నాట్లు వేసుకుంటూ జీవిస్తున్నారని ఆయన వివరించారు. కొంత మంది వ్యక్తులు ఎపి డిసిఎం పవన్‌కళ్యాణ్‌పై పనిగట్టుకుని విమర్శలు చేయడం మంచిదికాదన్నారు. పవన్‌కళ్యాణ్ ఎపితో పాటు తెలంగాణ అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నారని స్పష్టం చేశారు. అసరమైతే తెలంగాణలో పవన్‌కళ్యాణ్‌తో ఒక బహిరంగసభను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

## దేశప్రజల సంఘటిత శక్తితోనే జాతికి వైభవం

**-హైకోర్టు న్యాయవాది నారుమంచి అనంతకృష్ణశర్మ**



సభలో పాల్గొన్న అనంతకృష్ణశర్మ, ఫణీంద్ర, రాధశ్రీ, నరసింహాచార్య తదితర అతిథులు

**నాంపల్లి, జూన్ 8 ప్రభాతవార్త :** దేశ, సమాజహితం కోసం ప్రజలంతా సంఘటిత శక్తితో కృషిచేస్తేనే జాతికి వైభవం చేకూరుతుందని ప్రఖ్యాత హైకోర్టు న్యాయవాది, సంస్కృతాంధ్ర సాహితీమూర్తి నారుమంచి అనం తకృష్ణశర్మ అన్నారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, డిఏఎల్ఎన్.మూర్తి స్మారక సమితి సంయుక్త ఆధ్వర్యం లో ఆచార్య ఫణీంద్ర సభాధ్యక్షతన శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని డా. రావిచెట్టు రంగారావు కళావేదికలో తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాలు-21వ సమావేశానికి అనంత కృష్ణశర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత స్పందించి సమాజహిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పాశ్చాత్య ధోరణులకు అతీతంగా పనిచేయాలని పిలు పునిచ్చారు. ఈ సందర్భంగా మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి కృష్ణపక్షం కావ్య సమాలోచన డా. రాధశ్రీ; డిఏఎల్ఎన్.మూర్తి సాహిత్య సౌరభం అంశంపై మావుడూరు సూర్యనారాయణ మూర్తిలు సమగ్రంగా ప్రసంగించారు. సభకు సాధన నరసిం హాచార్య, హనుమంతరావులు స్వాగతం పలుకగా ఆచార్య వంగపల్లి విశ్వనాథం, దుగ్గిరాల వాసుదేవరావులు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. సభకుముందు బాలవిద్యార్థుల యత్ర నార్యస్తు పూజ్యంతే సాహిత్య సంగీత రూపకం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుని తన్మయుల్ని చేసింది.

# నీటి కోసం రోడ్డుపై బిందెలతో మహిళలు నిరసన



బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న బస్తీ మహిళలు.

**యూసుఫ్‌గూడ 8 జూన్, ప్రభాతవార్త :** వేసవిలో త్రాగేందుకు గుక్కెడు నీరు కూడా తమకు అందటం లేదంటూ పర్వత్‌నగర్ బస్తీలోని మహిళలు బిందెలతో నిరసన తెలిపారు. గత నెల రోజులుగా నిత్యం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో పాటు కనీసం తమకు నీటి ట్యాం కర్ల ద్వారా మంచినీరును అధికారులు అందివ్వడం లేదని తాము నీటి కోసం ఎక్కడికి వెళ్లాలని మహిళలు ప్రశ్నిస్తు న్నారు. సోమవారం పెద్ద ఎత్తున గాయిత్రినగర్ డివిజన్ పరిధి లోని పర్వత్‌నగర్‌కు చెందిన మహిళలు ఏకంగా బిందెలతో రోడ్డు పైకి వచ్చారు. ఎన్నిసార్లు అధికారులకు ప్రజా ప్రతినిధు లకు, స్థానిక సంక్షేమ సంఘం నాయకులకు మొరపెట్టుకున్నా వారు తమ సమస్యను ఏమాత్రం పట్టించుకోక పోగా నిర్లక్ష్యపు సమాధానం చెబుతూ మాట దాటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమకు వాడుకునేందుకు బోర్లు కూడా లేవని ప్రభుత్వం తరఫున ప్రజలకు అందుబాటులో పవర్ బోర్‌వె ల్‌లు ఏర్పాటు చేస్తే కనీసం వేసవిలో వాడుకునేందుకు నీరు అందుబాటులో ఉండేదని తమకు ఆ సౌకర్యం కూడా లేవన్నారు.

నీటి సరఫరా సక్రమంగా వదలక పోవడంతో తామంతా కూలిపని చేసుకుని జీవిస్తున్నామని మంచినీటి పైపులైన్లలో నీరు ఎప్పుడు సరఫరా అవుతదో తాము కళ్ల కాయలు కాసేలా ఎదురు చూడాల్సి న పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమకు తాగేందుకు నీటి సరఫరా అయ్యేలా చూడలని కోరారు.

## అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు భూమి పూజ



**నందిగామ, జూన్ 8, ప్రభాతవార్త :** నందిగామ గ్రామపంచాయతీ పరిధిలోని బండ కుంట తండాలో అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు సర్పంచ్ కొమ్ము కృష్ణ సోమవారం వార్డు సభ్యుడు లింగం ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ప్రతి పల్లె, ప్రతి తండా, ప్రతి గూడెంలో పార్టీలకతీతంగా అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. నందిగామ గ్రామపంచాయతీ, మండల ప్రజలకు, జిల్లా ప్రజలందరికీ మృగశిర కార్తె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, షాద్నగర్ మార్కెట్ డైరెక్టర్ నర్సింలు, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి మమత సూరి, దారా సురేష్, శివగళ్ల సురేష్, ప్రవీణ్ ,చించేటి లత శివకుమార్, బొమ్మగళ్ళ నర్సింలు, టైలర్ కృష్ణ, గంగిశెట్టి సరిత మురళి, సి సుమలత నర్సింలు ,కిట్టు, నాయకులు బి జంగయ్య గౌడ్,చించేటి కృష్ణ, పిట్టల రాములు, గోవింద్ నాయక్, ఎర్రగారి రమేష్, తదితరులున్నారు.



తుర్కపల్లిలోని మున్సిపల్ వార్డుల సభలో పాల్గొన్న అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, తదితరుల దృశ్యం

## తుర్కపల్లిలో మున్సిపల్ వార్డుల సభలు

**శామీర్‌పేట, జూన్ 8, ప్రభాతవార్త:** తుర్కపల్లిలోని 1,2,3,4వార్డులకు సంబంధించి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సందర్భంగా వార్డుల సభలను మున్సిపల్ అధికారులు నిర్వహించారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లిలోని 1,2,3,4వార్డులకు సంబంధించి వార్డు సభలను నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక-99రోజుల కార్యక్రమం సందర్భంగా వార్డుల సభలు నిర్వహించారు. ఈ వార్డుల సభలకు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ వెంకట్‌రెడ్డిల సమక్షంలో సభలు జరిగాయి. తుర్కపల్లిలోని ఆయా వార్డుల కౌన్సిలర్లు వెంకటేశ, దీప, దాసరి రవి, దీపికలు పాల్గొని ఆయా వార్డుల్లో ఉన్న అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను సభ దృష్టికి తెచ్చారు. వార్డు ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, అవసరాలు, సూచనలను స్వీకరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సభలో పాల్గొన్న వివిధ శాఖల ద్వారా అమలు అవుతున్న వాటిని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అధికారులు వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై అధికారులు స్పందించి వాటికి పరిష్కార మార్గాలను వివరించారు. అదే విధంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, యువజన ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు తమ అభిప్రాయాలను సభలో తెలియజేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగ అమలు చేయవచ్చని అన్నారు. ఈ వార్డుల సభల ప్రధాన ఉద్దేశ్యం ప్రజల సమస్యలను వార్డుల స్థాయిలోనే గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో త్వరగా పరిష్కరించుకోవటం, పారదర్శకంగ జవాబుదారితనంతో పాలన అందించటం అని అన్నారు. ఈ వార్డుల సభల్లో మౌళిక వసతుల కల్పన, పారిశుద్య నిర్వాహణ, త్రాగునీటి సరఫరా, వీధి దీపాలు, పచ్చదనం పెంపు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పలు అంశాలపై ఈ సభలో చర్చించారు. ఆయా వార్డుల సభలో వచ్చిన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకుని అభివృద్ధికి కృషి చేయటం జరుగుతుందని, సమస్యలను కూడ పరిష్కరించనున్నట్లు చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ వెంకట్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ సభలో వారితో పాటు కౌన్సిలర్లు, వెంకటేశ, దీప, దాసరి రవి, దీపిక, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దే చెత్తను వేరు చేయాలి

**సంకేపల్లిగూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య**

**షాబాద్, జూన్ 8, ప్రభాతవార్త :** ఇంటి వద్దే చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బంది కి ఇవ్వాలని సంకేపల్లిగూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య పేర్కొన్నారు. సోమవారం సంకేపల్లిగూడ లో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి, హానికార, ప్రత్యేక చెత్త ను వేర్వేరుగా ఇవ్వాలని చెప్పారు. కనీసం ఒక ఎకరం పొలం ఉండి జాబ్ కార్డు ఉంటే వారికి వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మునగ ప్లాంటేషన్ కు మంజూరు ఇస్తామని చెప్పారు. 1000 మొక్కలు నాటుకోవాలని అన్నారు. విత్తనాల ఖర్చు, మొక్కల సంరక్షి ంచేందుకు 9 నెలల పాటు మెంటేనెన్సు ఇస్తారని చెప్పారు. విష సర్పాలు పొదలలో సంచరిస్తున్నందన.. రాత్రి పూట బయటకు వెళ్లే టప్పుడు టార్చి, చెప్పులు ధరించాలని అన్నారు. మెడికల్ ఆఫీసర్ తబస్సుం మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, ఉప సర్పంచ్ గణపురం ప్రభాకర్, వార్డు సభ్యులు సంతోష, జయమ్మ, సోలిపేట నరేందర్, కాల్వ శ్రీనివాస్ రెడ్డి, బొగ్గుల సత్తయ్య, సి. యాదమ్మ, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్, హెచ్ ఎం నాయుడు, పద్మావతి, సువర్ణ, ఏఈవో శివతేజ, లైన్ ఇన్స్పెక్టర్ పరశురాం, జీవైక సభ్యులు శివరాములు, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో టెండర్ల విధానం రద్దు చేయాలి

**-మున్సిపల్ చైర్మేన్‌కు సంఘం నాయకుల వినతి**



మున్సిపల్ చైర్మేన్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**కొడంగల్,జూన్ 8,ప్రభాతవార్త:** మహాత్మాజ్యోతిభాపులే బీసీ గురుకులాల్లో టెండర్ విదానాన్ని రద్దు చేయాలని వాచ్‌మెన్,స్వీపర్‌లు డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం వారు కొడంగల్‌లో మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్‌కు వివిధ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్బంగా సంఘం నాయకులు వెంకటప్ప,విజయ్‌కుమార్,శ్రీనివాస్,వెంకటమ్మ,మంగమ్మ తదితరులు మాట్లాడుతూ మహాత్మాజ్యోతిభాపూలే గురుకులాల్లో గత 2017 సంవత్సరం నుంచి వాచ్‌మెన్,స్వీపర్స్ ,శానిటర్‌లుగా విధులు నిర్వహిస్తున్నామని,చాలీచాలనీ వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్న తమకు పని వేళలు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తునామని తెలిపారు.ఈ పని వేళలను 8 గంటలకు కుదించాలని కోరారు.అలాగే వేతనాలు పెంచడంతో పాటు ఈఎస్ఐ,పీఎఫ్‌లను ఇస్తు టెండర్ల విధానాన్ని రద్దు చేసి తమను అవుట్‌సోర్సింగ్ విధానంలోకి కలుపడంతో పాటు వేతనాలు నేరుగా తమ ఖాతాల్లోకి జమచేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.తమ డిమాండ్‌లు పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామ న్నారు. ఆయా డిమాండ్‌లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి డిమాండ్‌ల సాధనకు తనవంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మేన్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.ఈ సందర్బంగా విజయలక్ష్మి,బంద్యమ్మ,సాయిలు,సువర్ణ తదితరులున్నారు.

## ముఖ్యమంత్రి సలహాదారుని కలిసిన గుజ్జుల మహేష్



సన్మానిస్తున్న గుజ్జుల మహేష్

**తలకొండపల్లి జూన్ 8, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య రహదారులు అరకర వేణుగోపాల్ ను తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్ కలిశారు. సోమవారం నాడు హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుజ్జుల మహేష్ తదితరులు ఉన్నారు.

## నమ్మించి బంగారు ఆభరణాలు కాజేసిన నిందితుడు అరెస్ట్

**జూబ్లీహిల్స్, జూన్ 8, ప్రభాతవార్త:** స్నేహం పేరుతో నమ్మించి ఆభరణాలను కాజేసిన వ్యక్తిని జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ డిఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. గచ్చిబౌలికి చెందిన విశ్రాం త ఉద్యోగి రాజం రాజయ్య ప్రకాష్(70)కు రాములు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న రాములు, బంగారు ఆభరణాలను జ్యువెలరీ దుకాణంలో తాకట్టు పెడితే అధిక రుణం ఇప్పిస్తానని నమ్మించాడు.

రాజయ్య ప్రకాశ్‌కు చెందిన 62 గ్రాముల బంగారు ఆభరణాలున్న బ్యాగ్‌ను తీసుకుని రాములు పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన క్రైం పోలీసులు సోమ వారం జూబ్లీహిల్స్ రోడ్ నం.5 మెట్రో స్టేషన్ సమీపంలో నిందితుడు అబ్దుల్లాపురం చిన్నయ్య అలియాస్ రాములు(60) ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకొన్నారు.

అతన్ని నిజామా బాద్ జిల్లా వెంకల్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో అతని వద్ద నుంచి మొత్తం 57.66 గ్రాముల బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు అతడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.



పూడూరు మండలం చెన్‌గోముల్ గ్రామసభ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ బురిగేరి శ్రీనివాస్‌రెడ్డి,తదితరులు

## అందరి సహకారంతో గ్రామాభివృద్ధిచేస్తా

**మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బురిగేరి శ్రీనివాస్‌రెడ్డి**

**పూడూరు, జూన్ 8, ప్రభాతవార్త :** అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషిచేస్తానని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు,స్థానిక సర్పంచ్ బురిగేరి శ్రీనివాస్‌రెడ్డి పూర్కొన్నారు. 99రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా గ్రామంలో ఎలాంటి వ్యాధులు సోకకుండా ఆరోగ్యసిబ్బంది తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. మంచినీట పైప్‌లైన్ లీకేజీలపై పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. కరీఫ్ సీజన్‌లో రైతులు విత్తిన విత్తన ప్యాకెట్ల తోపాటు బిల్లులను భద్రపరుచుకోవాని సూచించారు. ప్రభుత్వం మహిళలను వాణిజ్యపరంగా అభివృద్ధిపరచాలన్న ఉద్దేశంతో వడ్డీలేని రుణాలను అందజేస్తుందని, వాటిని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్, ప్రత్యేకాధికారి, పంచాయతీరాజ్ ఎఇ మధుసూదన్, ఎఎస్ఐ సత్యయ్య, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఫరూఖ్, పంచాయతీ కార్యదర్శి పరుషరాం, జిపిఓ సాయికృష్ణ, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభల్లో పాల్గొన్న సర్పంచ్ బోయిని ఆంజిలయ్య

## గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**బోయిని ఆంజిలయ్య**

**కుల్కచర్ల,జూన్ 8 ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సకరించాలని సర్పంచ్ బోయిని ఆంజిలయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని పుట్టాపహడ్ గ్రామంలో 99 రోజుల ప్రణికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోయిని ఆంజిలయ్య మాట్లాడుతూ..గ్రామ అభివృద్దే లక్ష్యంగాప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ సభలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి తాసిల్దార్ మనోహర్ చక్రవర్తి, ఉప సర్పంచ్ లాల్‌బహదూర్ శాస్త్రి పంచాయతీ కార్యదర్శి భాస్కర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేంద్ర బహదూర్, గ్రామ వార్డు సభ్యులు గ్రామ సినియర్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభల్లో పాల్గొన్న సర్పంచ్ రవీందర్ నాయక్

## గ్రామ అభివృద్దే లక్ష్యం

**సర్పంచ్ రవీందర్ నాయక్**

**కుల్కచర్ల,జూన్ 8,ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధే లక్ష్యం ముందుకు సాగుతున్న సర్పంచ్ రవీందర్ నాయక్ అన్నారు..సోమవారం మండల పరిధిలోని చెరువుముందలి(ఎ) తాండ గ్రామ పంచాయతీలో 99 రోజుల ప్రణికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ..గ్రామ అభివృద్దే లక్ష్యంగా ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ సభలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలోవార్డు సభ్యులు గ్రామ సినియర్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ అవార్డులు మరిన్ని అందుకోవాలి

**సర్పంచ్ సితారం నాయక్**

**కుల్కచర్ల,జూన్ 8,ప్రభాతవార్త:** తన ప్రతిభకు గుర్తింపుగా మరిన్ని అత్యుత్తమ అవార్డులను అందుకోవాలి సర్పంచ్ సితారం నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎత్తుకాల్వ తాండ గ్రామ పంచాయతీలో 99రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదగా కుల్కచర్ల ట్రైబల్ వెల్ఫేర్ డిపార్మెంట్ నుండి ఉత్తమ సేవా ప్రశంసా అందుకున్న రాజేంద్ నాయక్‌ను గ్రామ సభలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..తన రంగంలో నిరంతర కృషి, అద్భుతమైన నైపుణ్యంలో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్, మాజి సర్పంచ్ లోక్య నాయక్, పంచాయతి కార్యదర్శి విజయలక్ష్మి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ సేవా ప్రశంసా అందుకున్న రాజేంద్ నాయక్ ను సన్మానిస్తున్న సర్పంచ్

## కస్తూరిబా పాఠశాల స్వీపర్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

**మండల విద్యాధికారి ఎం చంద్రశేఖర్**

**కేశంపేట, జూన్ 8, ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని మాటిగడ్డ లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న స్లీపర్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ పోస్ట్ భర్తీకి అర్హులైన మహిళ అభ్యర్థులు దరఖాస్తు కోరుతున్నట్లు మండల విద్యాధికారి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్య అర్హతలు ఏడవ తరగతి పాసై ఉండాలని 18 సంవత్సరాల నుండి 44 సంవత్సరాల మధ్య వయసుకులై ఉండాలని స్థానిక నివాసితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# ఫార్మసీ రంగంలో ఎఐ కీలక పాత్ర పోషిస్తుంది

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 8, ప్రభాత వార్త:** ఫార్మసీ రంగంలో ఏఐ కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తుందని ఎపిటీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మిలింద్ జన్రావ్ ఉమేకర్ అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా, తెలంగాణ రాష్ట్రశాఖ సహకారంతో ఎమర్జింగ్ రోల్స్ అండ్ స్ట్రాటజిక్ అప్లికేషన్స్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ నేచురల్ ప్రొడక్ట్స్ డ్రగ్ డిస్కవరీ అంశంపై అనుసంధాన్ జాతీయ పరిశోధన ఫౌండేషన్ ప్రాయోజిత ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రామ్ ఈ నెల 8 నుండి 12 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎపిటీఐ జాతీయ అధ్యక్షుడు మిలింద్ జన్రావ్ ఉమేకర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడుతూ ఎపిటీఐ సంఘ అభివృద్ధికి సభ్యులు అందించే సేవలపై దృష్టి పెట్టాలని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడుఎం. వెంకట రమణ మాట్లాడుతూ ఔషధ ఆవిష్కరణ, అభివృద్ధి ప్రక్రియలో ఏఐ వినియోగం ఖచ్చితత్వాన్ని పెంచి సమయం, వ్యయం తగ్గిస్తోందని అన్నారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ డిగ్రీల కంటే నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యత


ఎయులో ఫార్మసీ రంగ అభివృద్ధిపై జరిగిన సదస్సులో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎపిటీఐ జాతీయ అధ్యక్షుడు మిలింద్ జన్రావ్ ఉమేకర్ తదితరులు.

ఇవ్వాలని ప్రయోగాల పూర్తి కంటే ఖచ్చితమైన ఫలితాల సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ వసుధాభక్షి, ప్రోగ్రాం కన్వీనర్ జి. బాబా శంకర్‌రావు, కో కన్వీనర్ డాక్టర్ రామ్‌మోహన్, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలి

- **డిసిపి శిరీష రాఘవేంద్ర**
- **నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు అవసరం**
- **ఎస్‌బి పల్లిలో ప్రత్యేక గ్రామసభలో డిసిపి పిలుపు**

**కొత్తూర్, జూన్ 8 (ప్రభాతవార్త):**

గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని షాద్‌నగర్ డివిజన్ డిసిపి సి. శిరీష రాఘవేంద్ర ప్రజలకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం కొత్తూర్ మండలంలోని ఎస్‌బీ పల్లిలో సర్పంచ్ సుమిత్ర మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఇటీవల చోటుచేసుకుంటున్న చోరీల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లకు లేదా శుభకార్యాలకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,


అవగాహన కల్పిస్తున్న డిసిపి శిరీష

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ భద్రత, ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నరసయ్య, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, ఉపసర్పంచ్ గణేష్, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్‌గా రామకృష్ణ

**యాచారం,జూన్ 8, ప్రభాతవార్త:**

కృషి ఉంటే ఎవరికైనా కాంగ్రెస్ పార్టీ ఉన్నత పదవులు అందుతాయనడానికి పొలమోని రామకృష్ణ యాదవ్ ఆదర్శంగా నిలిచారు. యాచారం మండలం అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన పొలముని రామకృష్ణ కాంగ్రెస్ పార్టీలో క్షేత్రస్థాయి నుండి ఎంతగానో కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు పార్టీ మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ సమ రామ్మోహన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలుగా పని చేస్తే పార్టీ క్రమశిక్షణ సమన్వయం సమిష్టి కోసం ఎంతగానో కృషి చేశారు . రామకృష్ణకు యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని ఎంతోమంది శ్రేయోభిలాషులు పార్టీ నాయకులు కార్యకర్తలు తెలిపారు. ఆయనకు సహకరించిన పార్టీ పెద్దలు


రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రితో రామక్రిష్ణ యాదవ్ (ఫైల్ ఫోటో)

ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి కి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు మండల స్థాయి నాయకులు నియోజకవర్గం కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

**రంగారెడ్డి అర్బన్ జూన్8,ప్రభాతవార్త :** గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని గ్రామసభలు సమస్యల పరిష్కారానికి వేదికలుగా నిలుస్తాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.

సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ మండలం పాలమాకుల గ్రావ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామ సభలో ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య మెరుగుదల మరియు ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి పెద్దపీట వేస్తుందని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

పాలమాకుల గ్రామాభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ స్థులు, తదితరులు పాల్గొన్నారు.



## కేశంపేట మండల కేంద్రంలో బెల్ట్ షాపులను ఎత్తివేయాలి

**కేశంపేట ,జూన్8 , ప్రభాతవార్త :**

కేశంపేట మండల కేంద్రంలో గల్లీకి ఒక బెల్ట్ షాపులు ఉన్నాయి వాటి కారణంగా గ్రామంలో తెల్లవారుజామునే మద్యం సేవించే వారి సంఖ్య రోజురోజుకు పెరగడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని వెంటనే అక్రమ వెలసిన బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం కేశంపేట ఎస్సై రాజ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేసిన గ్రామస్తులు . ఈ కార్యక్రమంలో బైరమోని బాలరాజ్, బొజ్జం శ్రీశైలం, గంజాయి దశరథం, తలసాని పవన్ కుమార్ రెడ్డి, పోలేమని సతీష్, బైకని శేఖర్, రాజు, రాజేందర్ రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన సదానంద గౌడ్‌కు గ్రామస్తుల ఘన సన్మానం

**తలకొండపల్లి ,జూన్ 8, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామానికి ఐల సదానందం గౌడ్ కు ఇటీవల యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ వారిచే డాక్టరేట్ పురస్కారం లభించింది. దీంతో చిన్నంపల్లి వెంకటాపూర్ గ్రామాలకు చెందిన గ్రామస్తులు తమ గ్రామానికి చెందిన సదానందం గౌడు ఇతర దేశాలలోని యూనివర్సిటీ వారిచే గౌరవ డాక్టరేట్ పొందడం మన గ్రామానికి ఆదర్శమని, తమ గ్రామాన్ని మండలం, మండలం జిల్లా స్థాయిలో పేరు తెచ్చే విధంగా తమ గ్రామానికి మంచి పేరు తెచ్చాడని దీంతో అతనికి ఎంతో పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సదానందం గౌడ్ కొన్ని



సంవత్సరాలుగా విద్యావేత్త నిజాయితీ అంకితభావతంతో 26 సంవత్సరాలు గా లెక్చరర్గా పనిచేసి ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించాడని సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు శంకరయ్య, లక్ష్మీ నారాయణ గౌడ్ లఐ గౌడ్ శివరాజ్ లాల్ కుమార్ శివ గ్రామస్తులు తదితరులున్నారు.

## ఎంపిడిఓను సన్మానిస్తున్న గిరిజన నాయకులు

**తలకొండపల్లి, జూన్ 8, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల ఎంపిడిఒ అధికారి సీతారామమ్మను హర్యానా తండా చెందిన గిరిజన నాయకులు కలిశారు. నూతనంగా ఇక్కడికి బదిలీపై వచ్చిన మండల అభివృద్ధి అధికారి సీతారామమ్మను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్య నాయక్ తండాలో పలు సమస్యలు ఉన్నాయని , తండాలో మోలిక వసతుల కల్పనకు కృషి



చేయాలని, పెండింగ్లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని వారు ఎంపిడిఒకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య నాయక్ తండ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు విస్లావత్ వెంకటేష్ ఇస్లాంతో పంతు కేతవ దశ రథం, గిరిజన యువకులు నిరంజన్ చందు కృష్ణ నరేష్ పంతు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయా ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ఆహ్వానం

**షాబాద్, జూన్ 8, ప్రభాతవార్త :** షాబాద్ మండలం కొమరబండ గ్రామంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు దేవాదాయ శాఖ సోమవారం ఒక ప్రకటనలో ప్రకటించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు ఐఏఎస్ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ జారీ చేశారు. తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రిలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టం-1987 (చట్టం 30/87)లోని సెక్షన్ 15(2) ప్రకారం ఆలయానికి ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసు వెలువడిన తేదీ నుంచి 20 రోజుల అనంతరం ట్రస్ట్ బోర్డు ఏర్పాటు ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ట్రస్ట్ పదవులపై ఆసక్తి కలిగిన వ్యక్తులు నిర్దేశిత దరఖాస్తు నమూనా (ఫారం-II)లో తమ దరఖాస్తులను నోటీసు తేదీ నుంచి 20 రోజుల లోపు సంబంధిత దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌కు సమర్పించాలని సూచించారు. చట్టంలోని సెక్షన్ 17(3) నిబంధనల మేరకు దరఖాస్తులను పరిశీలించి ట్రస్ట్ బోర్డు సభ్యులను ఎంపిక చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.


ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్,తదితరులు

## పేదల గడపకు గౌరవం తెచ్చిన ఇందిరమ్మ ఇండ్లు

**-ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భరోసా.. ఎర్రోళ్ల జగన్**

**కొత్తూరు, జూన్ 8, ప్రభాతవార్త:**

పేద ప్రజలు అద్దె ఇళ్లలో ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం నిలుస్తోందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ పేర్కొన్నారు. కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆదివారం ఆయన ప్రారంభించి, సారే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లుగా నిరుపేదల సొంతింటి కల నెరవేరకపోయినా, ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కల సాకారమవుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇల్లు లేని కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్న ఈ పథకం ద్వారా వేలాది మంది పేదలు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం పొందుతున్నారని అన్నారు. అనంతరం లబ్ధిదారురాలు బ్యాగరి చంద్రమ్మకు సారే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, వార్డు సభ్యులు కమ్మరి వేదాంతచారి, ఆర్.రాములు, కే.మైబుజ్జి, మాధవి, అర్బాస్, మంద కుమార్, రమాదేవి, దేశాల శారద, కే.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలే గ్రామ ప్రగతికి దిక్సూచి

**-గ్రామాభివృద్ధికి ప్రజలే భాగస్వాములు: ఎంపీపీ విజయలక్ష్మి**

**కొత్తూరు, జూన్ 8, ప్రభాతవార్త:**

గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, గ్రామసభలు ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించేందుకు ఉత్తమ వేదికలుగా నిలుస్తాయని కొత్తూరు ఎంపీఓ విజయలక్ష్మి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం కొత్తూరు మండలంలోని మక్తగూడ గ్రామంలో సర్పంచ్ బోకుల శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమైన ఆమె, వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, వ్యవసాయ ఉద్యానవన శాఖల కార్యాచరణ, బడి బాట కార్యక్రమం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, విపత్తుల నిర్వహణ, పారి శుధ్యం, మొక్కల పెంపకం, జల సంరక్షణ, అరైవ్‌అ లైవ్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా ప్రజలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములు గౌడ్, గ్రామ కార్యదర్శి రవణీల, వార్డు సభ్యులు బోకుల రాజు, కృష్ణ, చందర్, కాట్న యశోద, రజిత, లావణ్య, బీటెక్ రాందాస్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఇంటా ఒక మొక్క



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎన్. బాలాజీ,తదితరులు

**కొత్తూరు, జూన్ 8, ప్రభాతవార్త:**

ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కొత్తూరు మునిసిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జే సుదర్శన్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఎన్. బాలాజీ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కొత్తూరు మునిసిపాలిటీ పరిధిలోని 8, 9, 10 వార్డులకు సంబంధించిన ప్రత్యేక వార్డు సభలను పాత మునిసిపల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. చెత్తను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి మునిసిపల్ వాహనాలకు అందజేయాలని సూచించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాల సంరక్షణకు తోడ్పడాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని ఓటు మ్యాపింగ్ పూర్తి చేయాలని కోరారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, తద్వారా ఎరువులు, వ్యవసాయ అవసరాలు సులభంగా పొందే అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం లేని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. వార్డు సభల ప్రత్యేక అధికారి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ అనిత మాట్లాడుతూ, నిరక్షరాస్యత నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, చదువు రాని వారు మెప్మా రిసోర్స్ పర్సన్ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వైద్యాధికారి డాక్టర్ దీప్తి మాట్లాడుతూ, వేసవి తీవ్రత నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, డీహైడ్రేషన్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్రామారెడ్డి, మునిసిపల్ మేనేజర్ ప్రభాకర్ గౌడ్, నాయకులు జె. సుదర్శన్ గౌడ్, వి. హేమ దేవేందర్, జగన్, నాగరాజు చారి, నర్సింలు, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ, వైద్య, మునిసిపల్ సిబ్బంది, ఆర్పీలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రపంచ మెదడు కణితి దినోత్సవం

**రంగారెడ్డి అర్బన్ జూన్8,ప్రభాతవార్త :** ముందస్తు చర్యలతో మెదడు కణితులు వ్యాధి భారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చాని డా. ఎం. సునీత పేర్కొన్నారు. ప్రపంచ మెదడు కణితి దినోత్సవం సందర్భంగా హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ నిపుణులు మెదడు కణితుల ప్రారంభ హెచ్చరిక లక్షణాలను గుర్తించడం మరియు సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం యొక్క ప్రాముఖ్యతపై శంషాబాద్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సినియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ క్లినికల్ డైరెక్టర్ డా. ఎం. సునీత మాట్లాడుతూ...మెదడు కణితులు ఏ వయస్సు వారినైనా ప్రభావితం చేయగలవని ఇవి తరచుగా నిరంతర తలనొప్పి, మూర్ఛలు, కారణం తెలియని బలహీనత, చూపు సమస్యలు, సమతుల్యత కోల్పోవడం, జ్ఞాపకశక్తి లోపాలు లేదా వ్యక్తిత్వ మార్పులు వంటి లక్షణాలతో కనిపించవచ్చుని ముందస్తు నిర్ధారణ మరియు తక్షణ చికిత్స వల్ల చికిత్స ఫలితాలు మెరుగుపడి, జీవన నాణ్యతను కాపాడుకోవచ్చని తెలిపారు. తాజా ఆవిష్కరణలలో ఒకటైన ఎంఆర్ లైనాక్ టెక్నాలజీ, అధిక నాణ్యత గల ఎంఆర్ ఇమేజింగును రేడియేషన్ చికిత్సలో కలిపి, వైద్యులకు కణితిని రియల్ టైమ్లో లో గమనించే అవకాశం కల్పిస్తుంది. దీని ద్వారా చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన మెదడు కణజాలాన్ని రక్షిస్తూ అత్యంత ఖచ్చితత్వంతో చికిత్స అందించవచ్చని తెలిపారు. ప్రజలకులక్షణాలపై అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సహాయం పొందాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు